క్లుప్తంగా

నేడు మిట్టగుడిపాడులో గడప గడపకు మన ప్రభుత్వం

రెంటచింతల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో మంగళవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి సోమవారం తెలిపారు.

నేడు మండల ప్రజా పరిషత్‌లో సమీక్షా సమావేశం

రెంటచింతల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి యార్ల మహాలక్ష్మి సోమవారం తెలిపారు. ఉదయం 10గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనులు గుర్తింపు, ప్రణాళికలపై చర్చించడం జరుగుతందన్నారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా గ్రామాల సచివాలయాల, ఉపాధిహామీ సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె కోరారు.

స్కూల్లో అసాంఘిక కార్యకలాపాలపై ఫిర్యాదు

మాచవరం: మండలంలోని తురకపాలెం యూపీ స్కూల్‌లో కొందరు వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలు చేపడుతూ పేకాట, మద్యం తాగడం వంటి వాటికి పాల్పడుతున్నారని హెచ్‌ఎం విజయలక్ష్మి, గ్రామ సర్పంచ్ షేక్ అల్లాభక్షు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల స్కూల్‌లో ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలు, విద్యుత్ బోర్డులు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని, విచారించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చేగువేరా వర్ధంతి



పిడుగురాళ్ల: పట్టణంలోని ప్రజాశక్తినగర్‌లో ఉన్న కన్నెగంటి హనుమంత్ భవనంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో క్యూబా పోరాట యోధుడు కామ్రేడ్ చేగువేరా 56వ వర్ధంతి నిర్వహించారు. ముందుగా చేగువేరా చిత్ర పటానికి సీపీఎం మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యూబా విముక్తి కోసం, దక్షిణాది దేశాల విముక్తి కోసం సైకిల్, మోటార్ సైకిల్‌పై పర్యటిస్తూ ఆయా దేశాల ప్రజల సమస్యలు తెలుసుకొని వారిని చైతన్య పరిచారని, ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా చివరి వరకు పోరాడిన యోధుడు చేగువేరా అని అన్నారు. ఈ కార్యక్రమంలో బత్తుల వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, జె.కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రంగురాళ్లు ఏరుకునే వారికి కౌన్సెలింగ్



నకరికల్లు: రంగురాళ్ల కోసం అత్యాశకు పోయి ప్రమాదాల బారిన పడవద్దని తహసీల్దార్ కె.నగేష్, ఎస్ఐ ఎ.బాలకృష్ణ సూచించారు. మండలంలోని త్రిపురాపురం కొండ ప్రాంతంలో చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు, యువకులు గత కొన్ని రోజులుగా మండుటెండను కూడా లెక్క చేయకుండా రంగురాళ్ల వేటలో పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్, ఎస్ఐలు సోమవారం వారి వద్దకు వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. అత్యాశతో అటవీ, కొండ ప్రాంతాల్లో తిరిగి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని చెప్పారు. అనంతరం వారిని అక్కడి నుంచి పంపించివేశారు.

మిర్చి పంట క్షేత్ర పరిశీలన



88త్యాళ్లూరు(క్రోసూరు): రాయల్ సీడ్స్ జయభేరీ మిరప విత్తనం సాగు చేసిన పొలాలను ఆ కంపెనీ ప్రతినిధులు రైతులతో కలిసి క్షేత్రప్రదర్శన చేపట్టారు. జయభేరీ విత్తనం అన్ని రకాల నేలలకు అనుకూలంగా ఉంటూ, చీడపీడలను, గులాబీ రంగు పురుగును సమర్థంగా తట్టుకుంటుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. చెట్టుకు 90 నుంచి 100 కాయలు దిగుబడినిస్తుందని తెలిపారు. ఎకరాకు 15 నుంచి 20 కింటాళ్ల దిగుబడిని ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిర్చి రైతులు పాల్గొన్నారు. కంపెనీ ప్రతినిధులు కొసనా నాగేశ్వరరావు, ఆర్‌ఎంజీ నరసింహారావు, ఎస్‌వో మహేష్, డిస్ట్రిబ్యూటర్లు కె.కొండలు ఎ.శ్రీనివాసరెడ్డి, కె.సురేష్, ఆర్.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

‘సురక్ష’ శిబిరాలకు పోటెత్తుతున్న ప్రజలు

కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో సోమవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరానికి మెగా స్పందన వచ్చింది. అనారోగ్య సమస్యలున్న గ్రామంలోని పేద ప్రజలు వైద్య శిబిరానికి తరలి వచ్చి డాక్టర్లకు తమ అనారోగ్య సమస్యలను తెలిపి మందులు రాయించుకుని ఉపశమనం పొందారు. ఎంతో కాలంగా వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారంతా తమ ఊరికే వచ్చిన డాక్టర్ల వద్ద చూపించుకుని మందులు తీసుకుని చాలా సంతోషంగా వెళ్లారు. మధ్యాహ్నం మూడు గంటలకే 656 మంది వైద్య సేవలు పొందారు. సాయంత్రానికి ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం కన్పిస్తోంది. కారెంపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రమ్య (క్యాంప్ ఆఫీసర్), డాక్టర్ డి.నాగేంద్రబాబు, డాక్టర్ ఆర్.ఆంజనేయులు నాయక్, డాక్టర్ బి.దుర్గారావు, డాక్టర్ బి.రఘుప్రసాద్ (ఆర్థోపెడిక్) రోగులకు వైద్యసేవలందించారు. కంటి సమస్యలున్న వారికి ఆప్తాలమిక్ ఆఫీసర్ జి.శ్రీధర్, సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. ఆయుష్ డాక్టర్ ఉదయలక్ష్మి ప్రత్యేక కౌంటర్ ద్వారా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 104, 108 సిబ్బంది, ఆశ వర్కర్లు , ఏఎన్‌ఎంలు, గ్రామ సచివాలయాల సిబ్బంది శిబిరంలో ప్రజలకు సేవలందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇరికెదిండ్ల రమణ, ఎంపీటీసీ ఇ.శ్రీను, ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి, పంచాయతీ విస్తరణాధికారులు సత్యప్రసాద్, కసిన్యానాయక్, డీటీ కీర్తి సుధా స్రవంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే వైద్య శిబిరానికి విచ్చేసిన వారికి అంగన్‌వాడీ టీచర్లు అల్పాహారం అందించారు.



అనారోగ్య సమస్యల ప్రకారం సంబంధిత స్పెషలిస్ట్ డాక్టర్ల వద్దకు రోగులను పంపుతున్న వైద్య సిబ్బంది

జగనన్న ఆరోగ్య సురక్ష అద్భుతమైన పథకం

దుర్గి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేద ప్రజలకు ఎంతో మేలును చేకూరుస్తుందని సర్పంచ్ నలబోతు వెంకటేశ్వర్లు (చిన్నబ్బాయ్) అన్నారు. సోమవారం మండల పరిధిలోని అడిగొప్పల గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని తహసీల్దార్ జి.రమేష్ కుమార్, ఎంపీడీఓ కె.సమతావాణితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. 45 రోజుల పాటు ఐదు దశలలో జరిగే ఈ ప్రక్రియలో రోగులకు నిర్దేశించిన ప్రాంతంలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేయటం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలోని వైద్య శిబిరంలో రికార్డు స్థాయిలో 751 మందికి పరీక్షలు చేసినట్లు తెలిపారు. శిబిరం నిర్వహణ పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పంచాయతీ సెక్రటరీ హాఫీజుద్దీన్, ఎంపీటీసీ షేక్ హుస్సేన్, సచివాలయం కన్వీనర్లు రాయల మధు, తాళ్ళ అంబారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగెండ్ల లక్ష్మీనారాయణ, తోట వాసు, నలబోతు వెంకయ్య, షేక్ నాగుల్ మీరా, డాక్టర్ వెంకయ్య, జార్జి, ఉప్పు రామకృష్ణ, నెల్లూరు లచ్చయ్య, పలువురు వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులున్నారు.



శిబిరానికి వచ్చిన వారికి అల్పాహారం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

జగనన్న ఆరోగ్య సురక్ష వ్యాధిగ్రస్తులకు రక్ష

రెంటచింతల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష రాష్ట్రంలోని వ్యాధిగ్రస్తులకు రక్ష అని తహసీల్దార్ కట్టెకోట పుల్లారావు అన్నారు. సోమవారం ఆయన మండలంలోని రెంటచింతల గ్రామంలో సర్పంచ్ పూజల పుష్పావతిరామయ్య అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని మారుమూల పల్లెల్లో వివిధ రకాల వ్యాధులతో బాధపడేవారికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులను కూడా అందచేయానికి సీఎం జగన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామంలో ప్రతి కుటుంబంలోని ప్రతి ఒక్కరి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని వారికి వైద్య సహాయం అందచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజల పుష్పావతిరామయ్య, ఉప సర్పంచ్ పేర్ల చౌడమ్మ, దుర్గి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, ఈఓపీఆర్డీ అనంత కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తుమ్మా ఇన్నారెడ్డి, పేర్ల ముత్తయ్య, కొమ్మారెడ్డి మర్రెడ్డి, గానుగపంట బ్రహ్మారెడ్డి, మనిగండ్ల మల్లిఖార్జునరావు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

341 మందికి వైద్య పరీక్షలు

మాచవరం: మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 341 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేసినట్లు ఎంపీడీఓ యు.వరప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎంతో కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.ఎస్.చక్రవర్తి, ప్రసాదరావు, కె.చంద్రహాసిత, అన్వేష్, ఈఓపీఆర్‌డీ వెంగళరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, పీహెచ్‌సీ సిబ్బంది, వలంటీర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదల వద్దకే వైద్య సేవలు

పిడుగురాళ్లరూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదవాడి వద్దకే వైద్య సేవలు అందించటం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని వారికి మెరుగైన వైద్య సేవలను అందించటంతోపాటు ఉచితంగా మందులను పంపిణీ చేయటం ఎంతో ఆనందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అల్లు సత్యవతి, పిచ్చిరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ బైరపోగు కుమారి, ఏలయ్య, మాజీ సర్పంచ్ ముత్యం ఉమామహేశ్వరరెడ్డి, గున్నం రెడ్డి రమణారెడ్డి, తహసీల్దార్ చక్రవర్తి, డాక్టర్లు కేవీ నాగిరెడ్డి, కేవీ ప్రవీణ్‌రెడ్డి, కోటేశ్వరి, రమాదేవి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు జి.ప్రవళిక, ప్రకాష్, హెల్త్ సూపర్‌వైజర్‌లు ప్రభాకర్, సారీ, మనోజ్‌కుమార్, లక్ష్మీబాయి, సుజాత, జి.కరుణమ్మ, పి.సాయి, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రోగికి మందులు రాస్తున్న డాక్టర్ నాగేంద్రబాబు



రెంటచింతలలో ...

జగనన్న సురక్షకు విశేష స్పందన



డాక్టర్ సుచరితను సన్మానిస్తున్న గ్రామస్తులు

దాచేపల్లి : మండలంలోని కేసానుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ క్యాంప్‌ను సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు ప్రారంభించారు. డాక్టర్లు సుచరిత, చక్రవర్తి ఈ శిబిరంలో పాల్గొని వివిధ రోగాలతో బాధపడుతున్న వారికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని, రోగులకు ఆరోగ్య భద్రత ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం, ఎంపీటీసీ ఏసుదాసు, నాయకులు నెల్లూరి కోటేశ్వరావు, ఉల్లేరు హనుమంతరావు, చెట్టిపాగు పాపయ్య, మీసాల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో పేదలకు వైద్యం అందించిన డాక్టర్లు సుచరిత, చక్రవర్తిలను గ్రామస్తులు సన్మానించారు.

మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి



మాట్లాడతున్న ఎంపీపీ

గురజాల : మండలంలోని గ్రామాలు అభివృద్ధి బాటలో నడవాలంటే ప్రతి ఒక్కరి సహాయ సహకారాలు ఉండాలని ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి అన్నారు. స్థానిక మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో సోమవారం మండల స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైద్య రంగంలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారన్నారు. విద్యారంగంలో నాడు-నేడు పనులతో కార్పొరేట్ స్థాయిలో పేదలకు విద్యనందించాలనే లక్ష్యంతో పాఠశాలల రూపురేఖలు మార్చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, కో ఆప్షన్ సభ్యుడు షేక్ పీర్ అహ్మద్, ఎంపీడీవో ఆర్ ఫణికుమార్ నాయక్, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండల స్థాయి అధికారులు తదితరులున్నారు.

పాలేష్ కుటుంబానికి వైఎస్సార్ బీమా నగదు అందజేత



పిడుగురాళ్ల: పట్టణంలోని నెమలిరెడ్డిబజారు సచివాలయం 2 పరిధిలో 17వ వార్డులో అనారోగ్యంతో మృతి చెందిన చల్లగుండ్ల పాలేష్ కుటుంబానికి వైఎస్సార్ బీమా నగదు సోమవారం అందజేశారు. ముందుగా చల్లగుండ్ల పాలేష్ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించి వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం కౌన్సిలర్ పసుపులేటి ఆనంద్ చేతుల మీదుగా మట్టిఖర్చుల నిమిత్తం రూ.10 వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ యూత్ కన్వీనర్ మందా సుధీర్, మార్కెట్ యార్డు డైరెక్టర్ మందా జాషువా, సచివాలయ కన్వీనర్‌లు పసుపులేటి అనిల్‌కుమార్, బంకా అనిల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు మందా సాగర్, చల్లగుండ్ల మరియదాసు, నర్రా మరియబాబు, బంకా ఏసోబు, దోమల అశోక్‌కుమార్, మందా శ్రీను, బంకా శివనాగ్, బంకా శేఖర్, సుంకర బుజ్జి, సచివాలయ సిబ్బంది సుధీర్, సురేష్, గోపయ్య పాల్గొన్నారు.

నేడు పిడుగురాళ్లలో జగనన్న ఆరోగ్య సురక్ష

పిడుగురాళ్ల: పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతుందని ప్రతి ఒక్కరు పాల్గొన్నాలని ఆయన తెలియజేశారు.

నేడు ఎస్‌ఆర్‌పీ తండాలో...

వెల్దుర్తి: మండల పరిధిలోని శ్రీరాంపురంతండా సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డి.ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ కోటేశ్వరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్లు వివరించారు. మంగళవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో పలు రకాల వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా అందజేసి సంబంధిత స్పెషలిస్టు వైద్యులచే శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ హాజరై వైద్య శిబిరంలో సంబంధిత వైద్యులను సంప్రదించి ఉచితంగా వైద్య సహాయం పొందాలన్నారు. ఈ శిబిరాన్ని సచివాలయ పరిధిలోని రచ్చమల్లపాడు, శ్రీరాంపురంతండా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళా చట్టాలపై అవగాహన సదస్సు

ముప్పాళ్ల(సత్తెనపల్లి): మహిళలు, బాలికా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీప్రసాద్ అన్నారు. హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం చట్టాలపై అవగాహన కల్పించి, కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానిక మహిళా మండలి సమైక్య భవనంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముప్పాళ్ల మండల డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు. మహిళలు, బాలికల కోసం ఎన్నో చట్టాలున్నాయని, వాటిని ఉపయోగించుకోవాలన్నారు. బాల్య వివాహాలకు స్వస్తి చెప్పి, తమ పిల్లలను తల్లిదండ్రులు ఉన్నత చదువులు చదివించాలని కోరారు. వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజరు బాలస్వామి మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణ కొరకు ఎన్ని కఠిన చట్టాలు చేసినప్పటికీ పసి పిల్లల మొదలు మహిళలపై అఘాయిత్యాలు, వేధింపులు నిత్యం జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తపరిచారు. ఇలాంటి క్రమంలో చట్టాలు, హక్కులు ద్వారా రక్షణ పొంది మనోధైర్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, రాములమ్మ, సీసీలు నాగరాజు, మల్లేశ్వరరావు, యాక్టివిస్టు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీప్రసాద్

మహిళపై దాడిని అడ్డుకున్నందుకే నిందలు

- న్యాయవాదిపై దురుసు ప్రవర్తన వార్త అసత్య ప్రచారం
- సీఐ వీరాస్వామి

అచ్చంపేట: పోలీస్ సిబ్బంది ఎదుటే మహిళపై దాడి చేసిన వ్యక్తిని నివారించినందుకే తమపై నిందలు వేస్తున్నారని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వీరాస్వామి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. గత నెల 20న వేల్పూరుకు చెందిన తాళ్లూరి ఆశాజ్యోతి అనే మహిళ వ్యక్తిగత కారణాలతో షుగర్ మాత్రలు ఎక్కువగా మింగి అచ్చంపేట పోలీస్ స్టేషన్‌కు వచ్చిందన్నారు. ఆమెకు వరసకు అన్న అయిన కోట సాంబశివరావు అనే వ్యక్తి పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఆశాజ్యోతిపై దాడిచేయబోగా డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ వై.సురేష్, స్టేషన్ రైటర్ సత్యంరాజు అడ్డుకున్నారని చెప్పారు. ఏదైనా సమస్య ఉంటే ఎస్ఐ మణికృష్ణతో చెప్పుకోమనడంతో.. తాను నేను లాయర్‌ని అని.. ఈమె తన చెల్లెలు అని, తన ఇష్టమొచ్చినట్లు కొట్టుకుంటానని వాదనకు దిగినట్లు చెప్పారు. ఈ క్రమంలో ఎస్ఐ వచ్చి స్టేషన్‌లో గొడవలు పనికిరావని, సమస్యలుంటే ఫిర్యాదు చేసుకోవాలని చెప్పడంతో.. సాంబ శివరావు అక్కడి నుంచి వెళ్లపోయినట్లు పేర్కొన్నారు. అంతేగాని సదరు సాంబశివరావుపై దురుసుగా ప్రవర్తించడం గాని, అమర్యాదగా మాట్లాడంగాని జరగలేదన్నారు. తనపై అచ్చంపేట ఎస్ఐ సీహెచ్ మణికృష్ణ దురుసుగా, అమర్యాదగా ప్రవర్తించాడంటూ సత్తెనపల్లిలో న్యాయవాదులతో కలిసి ధర్నాలు చేయడం, సోషల్ మీడియాలో అసత్య పోస్టింగ్‌లు పెట్టడం అమానుషమన్నారు. న్యాయవాదులు, పోలీసులు సమాజ హితం కోసం పనిచేయాలే తప్ప ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇచ్చే విధంగా ఉండకూడదన్నారు. ఆయన వెంట అచ్చంపేట ఎస్ఐ సీహెచ్ మణికృష్ణ, క్రోసూరు ఎస్ఐ కె.పాల్‌ఆనంద్ ఉన్నారు.



మాట్లాడుతున్న సీఐ కె.వీరాస్వామి

పౌష్టికాహార నాణ్యతపై ఆరోపణలు అవాస్తవం

అమరావతి: మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలకు, పిల్లలకు సరఫరా చేసే పౌష్టికాహార నాణ్యతపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని క్రోసూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అసిస్టెంట్ సీడీపీఓ సరళ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అమరావతి, ధరణికోట సెక్టారులలో అంగన్‌వాడీ కార్యకర్తలను, లబ్ధిదారులను ఆమె విచారణ చేశారు. ఓ దిన పత్రికలో వచ్చిన వార్త కథనంపై తాము జరిపిన విచారణలో పౌష్టికాహార పంపిణీలో ఎలాంటి నాణ్యత లోపాలు లేవని వెల్లడించారు. లబ్ధిదారుల నుంచి కూడా ఎటువంటి ఫిర్యాదు రాలేదని ఆమె తెలిపారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతీదేవి ఉన్నారు.

ఈకేవైసీ నమోదు పరిశీలన

నకరికల్లు: ఈకేవైసీ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు అన్నారు. నర్శింగపాడు గ్రామంలో ఈ-కేవైసీ నమోదు ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. ఖరీఫ్‌లో సాగుచేస్తున్న పంటలకు ఈ-క్రాప్ నమోదు, ఈ-కేవైసీ చేయించుకునేందుకు గడువు మంగళవారంతో ముగుస్తుందని తెలిపారు. మండలంలో 5,225 ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేస్తుండగా 75 శాతం మందికి పైగా రైతులు ఈ-కేవైసీ నమోదు చేసుకున్నారని తెలిపారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ



సత్తెనపల్లి: బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. అచ్చంపేట మండలం వేల్పూరు గ్రామానికి చెందిన న్యాయవాది కోట సాంబశివరావు పట్ల అచ్చంపేట ఎస్.ఐ మణికృష్ణ, రైటర్ సత్యరాజ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. సదరు ఎస్ఐ, రైటర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారూరి లింగారెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలు

కారెంపూడి: శృతిమించిన ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణం ఇబ్బందుల్లో పడిందని వాతావరణంతో పాటు నీటి కాలుష్యం పెరిగి జీవ మనుగడకు ముప్పు వాటిల్లుతోందని పర్యావరణ పరిరక్షణకు అందరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపి వేయాలని కారెంపూడికి చెందిన పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న కొమెర అంకారావు (జాజి) కోరారు. ప్లాస్టిక్ వల్ల అనర్థాలను దాని వల్ల పర్యావరణానికి జరుగుతున్న ముప్పును వివరిస్తూ జాజి రూపొందించిన కర పత్రాన్ని ఎస్ఐ ఎం.రామాంజనేయులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజి ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల గ్రామాలలో చెరువులు నీటి కుంటలు కలుషితం అవుతున్నాయని, నీటి కాలుష్యం వల్ల చిన్న ప్రాణులు చనిపోతున్నాయని గ్రామాలలో పారిశుద్ధ్య సమస్యలు పెరిగాయని ప్రతి ఒక్కరూ దీన్ని బాధ్యతగా తీసుకుని ముందుగా ఒక సారి వాడి బయట పడేసే అన్ని రకాల ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రీ చక్ర సిమెంట్స్ పీఆర్‌ఓ మురళీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎస్ఐ రామాంజనేయులు, పర్యావరణ ప్రేమికుడు జాజి

కాన్షీరామ్‌కు ఘన నివాళి

సత్తెనపల్లి: పట్టణంలోని పాత బస్టాండు సెంటరులో బీసీ సంఘాలు కాన్షీరామ్ 17వ వర్ధంతిని సోమవారం నిర్వహించాయి. కాన్షీరామ్ చిత్ర పటానికి పులమాల వేసి, నివాళులర్పించారు. బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే, రామస్వామి నాయకర్, ఛత్రపతి, అంబేడ్కర్ ప్రబోధాలను రాజ్యాధికారం వైపు నడిపించిన గొప్ప నాయకుడు కాన్షీరామ్ అని పేర్కొన్నారు. కులాన్ని నిర్మూలిద్దాం-బహుజన సమాజాన్ని నిర్మిద్దాం అంటూ దేశవ్యాప్తంగా ఉద్యమం చేసిన మహోన్నత నాయకుడు అని గుర్తుచేశారు. ఈ గుంటూరు గోవిందు, కుమ్మరి దస్తగిరి, బూర్సు శ్రీనివాసరావు, పెరుబోయిన ప్రకాష్, ఆళ్ల కనకయ్య, జి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కాన్షీరామ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు

రైతు ఆచూకీపై పోలీసులకు ఫిర్యాదు

నాదెండ్ల: మతిస్థిమితం, అనారోగ్యంతో బాధపడుతున్న రైతు ఈ నెల 6వ తేదీ నుంచి ఆచూకీ లేదంటూ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంకురాత్రిపాడు గ్రామానికి చెందిన రైతు బత్తుల ఐతంరాజు వ్యవసాయ పనులు చేసుకుని జీవిస్తుంటాడు. సుమారు ఏడాది నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల మతిస్థిమితం కోల్పోయాడు. కుటుంబ సభ్యులు వైద్యుని సలహా మేరకు చికిత్స చేయిస్తున్నారు. ఈ నెల 6వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో గ్రామంలోని బస్టాప్ వద్ద నుంచి నరసరావుపేట వెళ్లే పల్లెవెలుగు ఆర్టీసీ బస్సు ఎక్కినట్లు సీసీ పుటేజీల్లో గుర్తించారు.

ఈతకు వెళ్లి యువకుడు మృతి

వినుకొండ(నూజెండ్ల) : ఈతకు వెళ్లి యువకుడు మృతిచెందిన ఘటన నూజెండ్ల మండలంలోని బుర్రిపాలెం గ్రామంలో జరిగింది. సేకరించిన వివరాల మేరకు... బుర్రిపాలెం గ్రామానికి చెందిన యన్నాబత్తుని ఎర్రయ్య, ఏసమ్మల పెద్దకుమారుడు మనేష్ (21) డిగ్రీ చదువుతున్నాడు. సోమవారం ఉదయం మనేష్ తన ఇద్దరు మిత్రులతో కలిసి గ్రామ సమీపంలో నూతనంగా తవ్విన బావిలో ఈతకు వెళ్లాడు. మనేష్ ప్రమాదవశాత్తు బావినీటిలో మునిగి మరణించాడు.